ప్రజాశక్తి

శుక్రవారం 18 ఏప్రిల్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

కృష్ణా నదిలో మునిగి

ఇద్దరు యువకులు మృతి



మృతిచెందిన దేవదాసు, గౌతమ్

ముగ్గురిని కాపాడిన స్థానికులు

ప్రజాశక్తి-రేపల్లె, భట్టిప్రోలు

కృష్ణానదిలో మునిగి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన రేపల్లెలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భట్టిప్రోలు మండలం, వేమవరం గ్రామానికి చెందిన 50 మంది క్రైస్తవులు బాప్తిస్మం తీసుకునేందుకు రేపల్లె వద్ద ఉన్న కృష్ణా నది వద్దకు వచ్చారు. స్నానాలు చేసేందుకు కృష్ణానదిలోకి దిగారు. ఐదుగురు యువకులు లోతుగా వెళ్లి స్నానాలు చేస్తుండగా కొట్టుకుపోయారు. వీరిలో ముగ్గురిని స్థానికులు రక్షించారు. పెనుమాల దేవదాసు(19), టి గౌతమ్ (18) యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. చేతికందొచ్చిన యువకులు మృతిచెందటంతో వారి కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జునరావు యువకుల మృతదేహాలను పరిశీలించి.. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను రేపల్లె ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో ఉంచినట్లు సిఐ తెలిపారు.

ప్రభుత్వం పరిహారం అందించాలి

ప్రమాదవశాత్తూ నదిలో మునిగి చనిపోయిన కుటుంబాలను ▶ 2లో



మృతదేహాలను పరిశీలిస్తున్న సిపిఎం నేత మణిలాల్

రైతు c/o రోడ్డు

- గిట్టుబాటు ధరకు కొనేవారు రాక బర్లీ పొగాకు రైతుల ఇక్కట్లు
- నిత్యం రాస్తారోకో చేస్తున్న కర్షకులు
- పట్టించుకోని పాలకులు



బొమ్మిడాల టుబాకో కంపెనీ వద్ద హైవేపై పొగాకు దహనం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మొన్నటివరకు రేయనకా, పగలనకా.. పొలంలో కష్టపడ్డ రైతన్న.. ప్రస్తుతం ఆ పంటను అమ్ముకొనేందుకు రోడ్డెక్కాల్సిన దుస్థితిని పాలకులు కల్పించారు. గతేడాది బర్లీ పొగాకు సాగుతో రైతులకు ఖర్చులు పోను కొంత లాభం మిగిలింది. ఈ ఏడాది కూడా ఆ కొంచెం లాభమైనా మిగులుతాయన్న ఆశతో బర్లీ సాగు చేయడం రైతుల పాలిట శాపమైంది. పంట చేతికి వచ్చాక పొగాకు కొనేవారు లేక రైతులు నిత్యం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. బుధవారం కూడా రైతులు మద్దిపాడులో రాస్తారోకో చేసి.. పొగాకు తగలబెట్టి నిరసన తెలిపారు.

గతేడాది వైట్‌బర్లీ, బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు ఖర్చులు పోనూ కొంచెం లాభాలు చూశారు. దీంతో ఈ ఏడాది జిల్లాలో రైతులు అత్యధికంగా పొగాకు సాగు చేశారు. జిల్లాలో సాధారణ పొగాకు సాగు విస్తీర్ణం 17 వేల ఎకరాలు కాగా ఈ సీజన్‌లో జిల్లాలో 66 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. గత ఏడాది రైతులు బ్లాక్‌బర్లీ పొగాకు సాగు చేయగా ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ధర రూ 15 వేల వరకు పలికింది. వైట్‌బర్లీ కూడా ఎకరాకు 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ధర రూ.18 వేల వరకు పలికింది. దీంతో పొగాకు సాగు చేసిన రైతులకు ఆదాయం వచ్చింది. ఈ కారణంగా ఈ ఏడాది రైతులు శనగ, మిర్చి సాగును కూడా పక్కనపెట్టి పొగాకు సాగు చేశారు.

సాగు ఖర్చులు పెరిగినా కూడా కొంచెమన్నా మిగులుతుందనే ఆశతో ▶ 2లో

వడివడిగా అడుగులు..

- ఎయిర్‌పోర్టు సాకారానికి తొలి అడుగు
- భూసేకరణకు రూ.115.78 కోట్లు మంజూరు



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ సాకారానికి నిధులు మంజూరు చేయటంతో తొలి అడుగు పడినట్లయింది. ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత 657.57 ఎకరాల భూసేకరణకు రూ.115.78 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై జిల్లా ప్రజల ఆశలు నెరవేరే సమయం ఆసన్నమైంది.

రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగం అభివృద్ధికి చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలోని 7 ప్రాంతాలలో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కృషి చేస్తోంది. ఆయా ప్రాంతాలలో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణకు రూ.1570.64 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఒంగోలులో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి గత ఐదేళ్ళుగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గతంలో ఒంగోలు ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పలు దఫాలు ▶ 3లో

పెండింగ్ కేసులు తగ్గించేందుకు కృషి

- ప్రాపర్టీ నేరాల కట్టడి, రికవరీకి ప్రత్యేక బృందాల ఏర్పాటు
- మహిళల భద్రతకు ప్రాధాన్యత
- కేసుల ఛేదనకు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- నేర సమీక్షలో ఎస్పీ దామోదర్



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా నిలిచి వారికి తగిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ సూచించారు. పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేలా కషి చేయాలని కోరారు. నెలవారీ నేర సమీక్షాలో భాగంగా జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ దామోదర్ గురువారం మార్కాపురంలోని సౌజన్య కన్వెన్షన్ హాలులో నేరసమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ వారీగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్తుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై జిల్లా ఎస్పీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్టేషన్ పరిధిలో నమోదైన గ్రేవ్/నాన్ గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, శారీరక నేరాలు, ప్రాపర్టీ నేరాలు, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమాచారంతో పాటు, ఎన్‌బిడబ్ల్యూఎస్, ఎఫ్ఎస్-ఎల్/ఆర్ఎఫ్ఎస్ఎల్ పెండింగ్, సీసీటిఎన్ఎస్, ఎంసిఆర్, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందని.. మొదలైన అంశాలపై పోలీస్ అధికారులతో సమీక్షించి ఎస్పీ పలు సూచనలు, సలహాలు చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపించి వాటి సంఖ్యను తగ్గించేలా కషి చేయాలన్నారు. ఆర్ఎఫ్ఎస్ఎల్, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులను త్వరితగతిన తెప్పించుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్‌బిడబ్ల్యు వారెంట్స్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామ సందర్శన తప్పనిసరిగా చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. కేసుల దర్యాప్తులో విషయంలో అధికారులు అందుబాటులో టెక్నాలజీతో పాటు, శాస్త్రీయ పద్ధతిని కూడా అనుసరిస్తూ దర్యాప్తు చేపట్టాలన్నారు. చెడు నడత గల వారి పట్ల చట్టపరంగా వ్యవహరించడంతో పాటు వారిపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎక్కువ నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రతిపాదనలు పంపించాలని, బాలికలు, మహిళల కేసుల్లో అలసత్వం వహించకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పాఠశాలు/కళాశాలలు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించాలని, ▶ 2లో

రైతు c/o రోడ్డు

(మొదటిపేజీ తరువాయి)

పొగాకు సాగు చేశారు. సొంతంగా పొలం లేని రైతులు కూడా రూ.30 వేల నుంచి రూ.40 వేలకు పైగా కౌలు చెల్లించి పొగాకును సాగు చేశారు. గత సంవత్సరం మొదటి విరుపు అడుగు ఆకు కొట్టిన తర్వాత అమ్మితే రూ.8 వేల నుంచి రూ.10 వేలకు కొన్నారు. అదే పొగాకును ఈ సంవత్సరం రూ.4 వేల నుంచి రూ.5 వేలకు కొంటున్నారు. అలాగే రెండో వలుపు, మూడో వలుపు పొగాకును గత సంవత్సరం రూ.15 వేల నుంచి రూ.18 వేలకి కొన్నారు. కానీ ఈ సంవత్సరం పొగాకు ధరలు పడిపోవడంతో పాటు కొనేందుకు ఎవరూ రాలేదు. ఈ కారణంగా జిల్లాలో పొగాకు సాగు చేసిన రైతులు నష్టాల పాలయ్యారు. కౌలుకు సాగు చేసిన రైతులు మరింత నష్టాలు, కష్టాల పాలయ్యారు.

ఇప్పటికే పొగాకు రైతులు జిల్లా కలెక్టర్‌కు తమ సమస్యలను మొర పెట్టుకున్నారు. జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి దృష్టికి పొగాకు రైతుల సమస్యలను తీసుకెళ్లారు. ఇటీవల జిల్లా సంయుక్త కలెక్టర్ పలు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం జరిపారు. జిల్లాలో 70 మిలియన్ కిలోల బర్లీ పొగాకు నిల్వలు ఉన్నట్లు తేల్చారు. ప్రైవేట్ కంపెనీల వారు తాము తలో కొంత కొంటామని సదరు సమావేశంలో చెప్పారు. ఐటిసి, జిపిఐ, డెక్కన్, అలయన్స్, మహాలక్ష్మి తదితర కంపెనీల వారు ఈ పొగాకును కొనాల్సి ఉంది. గత నెలలోనే పొగాకు కొంటామని వారు ఇచ్చిన హామీ నెరవేరలేదు. దీంతో మూడు రోజుల క్రితం పొగాకు రైతులు పర్చూరు, ఇంకొల్లులో రాస్తారోకో చేశారు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వం జోక్యం చేసుకొని బర్లీ పొగాకును మద్దతు ధరతో కంపెనీలతో కొనిపించాలని రైతుసంఘాల నేతలు కోరుతున్నారు. ఎఫ్‌సివి వర్జీనియా పొగాకు ధరలను, విస్తీర్ణాన్ని పొగాకు బోర్డు నియంత్రిస్తుందని, బర్లీ పొగాకుని కూడా పొగాకు బోర్డు పరిధిలోకి తీసుకురావాలని చెబుతున్నారు. దాని వల్ల రైతులకు చాలా మేలు జరుగుతుందన్నారు. బర్లీ పొగాకు రైతులు తగిన మద్దతు ధర లేక, కొనేవారు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పొగాకు దహనం చేసి..నిరసన

మద్దిపాడు : బర్లీ పొగాకుకు సరైన గిట్టుబాటు ధర ఇవ్వడం లేదంటూ రైతులు పొగాకును దహనం చేసిన ఘటన మద్దిపాడు-వెల్లంపల్లి గ్రామాల మధ్య బొమ్మిడాల టుబాకో కంపెనీ వద్ద జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. నకరికల్లు, నూజెండ్ల, దొనకొండ, సంతమాగులూరు, ఈపూరు, వినుకొండ తదితర మండలాల నుంచి పొగాకు బేళ్లను బొమ్మిడాల కంపెనీ వారు తెచ్చుకోమనడంతో వ్యయప్రయాసలకోర్చి తెచ్చారు. 600 బేళ్లలో 500 బేళ్లు వెనక్కి పంపారు. మిగిలిన చెక్కులకు కేజీ పొగాకు ధర రూ.40 నుంచి రూ.60 మాత్రమే వేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బేళ్లను తీసుకొని రైతులు జాతీయ రహదారిపైకి తీసుకొచ్చి.. వాటిని తగలబెట్టారు.

ఇద్దరు యువకులు మృతి

(మొదటిపేజీ తరువాయి)

సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్, సిపిఎం భట్టిప్రోలు మండల కార్యదర్శి జి సుధాకర్ పరామర్శించారు. చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆశీర్వాదం పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు తగ్గించేందుకు కృషి

(మొదటిపేజీ తరువాయి)

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం వాహనాలు తనిఖీలు నిర్వహించాలని, ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లు తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను పట్టుకోడానికి మరియు దొంగిలించబడిన సొత్తును రికవరీ చేయటానికి ప్రత్యేక బందాలను ఏర్పాటు చెయ్యాలని, జైలు రిలీజ్డ్ మానిటరింగ్ ద్వారా పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, విజిబుల్ పోలీసింగ్ చేస్తూ, నైట్ బీట్స్ బలోపేతం చేసి తనిఖీలు నిర్వహించాలన్నారు. నేర నియంత్రణలో భాగంగా ప్రతి పట్టణంలోని కాలనీల్లో, గ్రామాలలో, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతపై అవగాహన సమావేశాలు నిర్వహించాలని, గుట్కా, మట్కా, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శక్తి కాల్స్‌పై వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో మెదులుతూ అంకితభావంతో విధులు నిర్వహించాలని, సమర్థవంతమైన సేవల ద్వారా జిల్లా పోలీస్‌శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ముందుగా ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ ఐజి బాలరాజు జిల్లాలో జరిగిన నేర సమీక్ష సమావేశమును జూమ్ వీడియో కాన్ఫరెన్స్ లో సిసిటిఎన్ఎస్ ద్వారా పర్యవేక్షించారు. నేరాలు చేదించుటకు సాంకేతికతను అందిపుచ్చుకోనేందుకు పోలీసు ఉన్నతాధికారులు మొదలుకొని కిందిస్థాయి సిబ్బంది వరకు పలు సూచనలు తెలియజేశారు. సాంకేతికను బాగా ఉపయోగించుకొని ప్రకాశం జిల్లా మంచి పురోగతి సాధించిందని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్‌ను ఐజి బాలరాజు అభినందించారు. నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, నాగరాజు, రమణకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, డిసిఆర్‌బి సీఐ దేవప్రభాకర్, ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు

మండల సమావేశంలో సభ్యుల ఆరోపణ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఉపాధి పనుల్లో అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లు మండల ఉపాధ్యక్షులు మెట్టు వెంకటరెడ్డి, గొట్లగట్టు ఎంపిటిసి ఉడుముల రామనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మోరబోయిన మురళీకష్ణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం అస్తవ్యస్తంగా తయారైందదన్నారు. అధికారుల పర్యవేక్షణ కొరబడిందని, దీంతో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు దూర ప్రాంతంలో ఉన్న వారికి, పనికిరాని వారికి మాస్టర్లు వేసి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు వాటాలు తీసుకొని పట్టించుకోవడం లేదన్నారు. సామాజిక తనిఖీ అధికారులు కూడా



మాట్లాడుతున్న ఎంపిపి మురళీకష్ణ

ముడుపులు పుచ్చుకొని నామమాత్రంగానే ఆడిట్ నిర్వహించి వెళ్ళిపోతున్నారని దుయ్యబట్టారు. వెలిగండ్ల సర్పంచి పాతకోట వెంకటరెడ్డి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ తమ పంచాయతీలో ఉపాధి పనులు ఏకపక్షంగా చేపడుతున్నారని అలాంటప్పుడు తాము ఎందుకు తీర్మానాలు ఇవ్వాలని ప్రశ్నించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ఎన్ఎపి పథకం ఏర్పాటు చేసి నప్పటికీ నీటిని సక్రమంగా సరఫరా చేయడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారని ఎన్ఎపి ఎఇ శ్రీకాంత్‌పై మండల రెండవ ఉపాధ్యక్షులు మెట్టు వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. గొట్లగట్టు ఎంపిటిసి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ చినారికట్ల, పెదారికట్ల గ్రామాల మీదుగా సాగర్ పైపులైను వెళ్తున్న ఆ గ్రామాలకు సాగర్ నీరు ఎందుకు సరఫరా చేయటం లేదని ఏఇని ప్రశ్నించగా అప్పట్లో ఆ గ్రామాలను ఆ పథకంలో చేర్చలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి అక్కి దాసరి ఏడుకొండలు, ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ, ఎఒ ప్రసన్నరంగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

మిట్టపాలెంలో 'బెల్ట్ షాపు' గొడవ

ప్రజాశక్తి-త్రిపురాంతకం

బెల్ట్‌షాపుల నిర్వహణపై నెలకొన్న వివాదం మిట్టపాలెంలో ప్రకంపనలు తెచ్చింది. గ్రామంలోని రెండు వర్గాలు బెల్ట్ షాప్ ఏర్పాటు విషయంలో పరస్పరం దాడులకు దిగాయి. యర్రగొండపాలెం ఎక్సైజ్ సిఐ శ్రీనివాసులు తన సిబ్బంది, మిట్టపాలెం విఆర్ఒ గురువారెడ్డితో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో సిఐ శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. బెల్ట్ షాపులపై స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై మిట్టపాలెం గ్రామంలో ఏవైనా బెల్ట్ షాపులు నడిపినా లేదా నిషేధిత మద్యం విక్రయానికి ప్రయత్నించినా వారిపై ఎక్సైజ్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వరి గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి- వెలిగండ్ల

విద్యుత్ తీగ తెగిపడి మంటలు చెలరేగిన ఘటనలో వరిగడ్డి వామి దగ్ధమైంది.ఈ ఘటన మండల పరిధిలోని కొటాలపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్న సమయంలో చోటు చేసుకుంది. బాధితుడు కొండు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. వరి గడ్డివామి మీదుగా కరెంటు తీగలు ఉన్నాయి. అందులో ఒకటి తెగిపడటంతో మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే వరిగడ్డి మొత్తం కాలి బూడిదైంది. దగ్ధమైన వరి గడ్డి విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధితుడు వెంకటేశ్వర్లు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో వైసిపి నేత అరెస్టు

ప్రజాశక్తి-శింగరాయకొండ

క్రికెట్ బెట్టింగ్ కేసులో శింగరాయకొండకు చెందిన వైసిపి నాయకులు మసనం వెంకట్రావును అరెస్టుకందుకూరు కోర్టులో గురువారం హాజరు పరిచినట్లు ఎస్ఐ బి.మహేంద్ర తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన సతీష్ కుమార్ అనే వ్యక్తి మసనం వెంకట్రావు క్రికెట్ బెట్టింగ్ విషయంలో తనను మోసం చేసి ఇబ్బందులకు గురి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసినట్లు తెలిపారు. వెంకట్రావును కందుకూరు కోర్టుకు హాజరుపరచగా ఈనెల 30 వరకూ న్యాయ మూర్తి విధించడంతో నెల్లూరు జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వడివడిగా అడుగులు

(మొదటిపేజీ తరువాయి)

చర్చించారు. ఒంగోలు ఎంపీతో పాటు ఒంగోలు శానససభ్యులు దామచర్ల జనార్ధనరావు ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైతం ఒంగోలులో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేస్తామని పలు బహిరంగ సభలలో వెల్లడించారు. దీంతో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు శానససభ్యులు దామచర్ల జనార్ధనరావు చొరవతో ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ అధికారులు ఎయిర్‌ఫోర్ట్ ప్రతిపాదిత భూములను పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ఈ భూములు అనువుగా ఉన్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ అధికారులు నివేదికలు ఇచ్చారు.

భూసేకరణకు 115.78 కోట్లు మంజూరు

ఒంగోలులో ఎయిర్‌పోర్ట్ భూముల సేకరణకు ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత 657.57 ఎకరాల భూసేకరణకు రూ.115.78 కోట్లు మంజూరు చేసింది. భూసేకరణకు చర్యలు తీసుకోవాలని ఎపిఎడిసి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే ఎయిర్‌పోర్ట్ నిర్మాణం మరింత ముందుకు సాగే అవకాశాలు ఉన్నాయి.

కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి -పామూరు : కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడిగా పామూరు మండలం వగ్గంపల్లి గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వర రెడ్డి నియమితల య్యారు. వెంకటేశ్వరరెడ్డి 2017లో కాంగ్రెస్ పార్టీలోసాధారణ కార్యకర్తగాచేరారు. 2018లో అప్పటి పిసిసి అధ్యక్షులు రఘువీరా రెడ్డి నాయకత్వంలో కనిగిరి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పనిచేశాడు. 2020లో ఒంగోలు పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్, 2022లో కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త మరియు పిసిసి సభ్యుడిగా పనిచేశారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సైదా, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్., సోనియా గాంధీ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి- దొనకొండ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన యురేకా సైన్స్ ప్రయోగాల పోటీల్లో దొనకొండ సెయింట్ ఆంధోనీస్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. 8వ తరగతి విద్యార్థిని దివ్య సైన్స్ ఫేర్‌లో ప్రదర్శించిన ఘర్షణశక్తి ప్రాజెక్టు, వీడియో ప్రయోగానికి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి దక్కింది. ఈ మేరకు జనవిజ్ఞాన వేదిక ల్లా కార్యదర్శి దేవిప్రసాద్, మండల అధ్యక్షుడు భూమా సురేష్ పాఠశాలలో గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దివ్యకు ప్రశంసాపత్రం, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా దివ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ థామస్, ప్రభుత్వ ఉర్దూ పాఠశాల హెచ్ఎం ప్రభుదాసు, పాఠశాల హెచ్ఎం సిస్టర్ అరుణ పవిత్ర, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరా అందజేత

ప్రజాశక్తి- పిసిపల్లి : పిసిపల్లి పోలీసు స్టేషన్‌కు మండలం పరిధిలోని లక్ష్మక్కపల్లికి చెందిన ప్రముఖ బిల్డర్ ,వైసిపి నాయకులు బద్దెల రత్నారెడ్డి డ్రోన్ కెమెరాను గురువారం అందజేసినట్లు స్థానిక ఎస్ఐ జి. కోటయ్య తెలిపారు. మార్కాపురంలో పోలీసు సిబ్బందితో గురువారం నిర్వహించినే సమావేశంలో రత్నారెడ్డి తమ ప్రతినిధి ద్వారా ఎస్‌పి దామోదర్‌కు డ్రోన్ కెమెరా అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు. పిసిపల్లి మండల అవసరాల కోసం ఎస్‌పి డ్రోన్ కెమెరాను తమ పోలీసు స్టేషన్‌కు అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు. డ్రోన్ కెమెరాపై అవగాహన కల్పించిన స్థానిక కానిస్టేబుల్ పత్తి వెంకటేశ్వర రెడ్డిని ఎస్‌పి అభినందించి ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డిఎస్‌పి ఈశ్వర్ సాయి యశ్వంత్, కనిగిరి సిఐ ఖాజావలి, పిసిపల్లి ఎస్ఐ కోటయ్య, లక్ష్మక్కపల్లి సర్పంచ్ మాదాల మాలకొండయ్య, గ్రామస్తులు మాదాల కష్ణ ,బి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-టంగుటూరు

టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి. కొండారెడ్డి డిమాండ్ చేశారు. టోల్ ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండో రోజు గురువారమూ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొండారెడ్డి మాట్లాడుతూ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని గత రెండు రోజులుగా నిరసన తెలుపుతున్న యానమాన్యం పట్టించుకోక పోవడం బాధాకరమని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు



మాట్లాడుతున్న జివి. కొండారెడ్డి

నాయకుడు రాము , టోల్ ప్లాజా యూనియన్ ప్రెసిడెంట్ దుగ్గిరాల తిరుమలరావు, సిఐటియు కార్యదర్శి గేరా కాశీ విశ్వనాధ్, ఐఎఫ్‌టియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -కనిగిరి

తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో 16వ ఫైనాన్స్ కమిషన్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో స్థానిక సంస్థల బలోపేతం మరియు అభివృద్ధిపై గురువార సమావేశం నిర్వహించారు. ఈ సమావేవంలో రాష్ట్రంలోని 15 మంది మేయర్లు ,మున్సిపల్ చైర్మన్లు పాల్గొన్నారు. కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో షేక్ అబ్దుల్ గఫ్ఫార్ మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీ అభివద్ధికి సాధ్యమైనంత మేర ఎక్కువ నిధులు మంజూరు చేయాలని కోరారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రతిపాదనలతో మంత్రి నారాయణ ద్వారా కనిగిరి మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.6 కోట్లు, వెజిటబుల్ మార్కెట్ భవన నిర్మాణానికి రూ.3 కోట్లు, మటన్ మరియు ఫిష్ మార్కెట్ భవన నిర్మాణానికి రూ.3 కోట్లు , నూతన డ్రైనేజ్ కాలువల నిర్మాణానిక రూ .4 కోట్లు మంజూరు చేసి అభివద్ధికి సహకరించాలని కోరారు. ముందుగా రాష్ట్ర మున్సిపాలిటీల ప్రత్యేక కార్యదర్శి సురేష్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

ఇమాంసాకు అభినందనలు

ప్రజాశక్తి -పొదిలి

పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టిడిపి నాయకులు, మాజీ ఎంపిటిసి సయ్యద్ ఇమాంసా నియమితులయ్యాడు. అందులో భాగంగా పలువురు నాయకులు, కార్యకర్తలు అభిమానులు గురువారం ఇమాంసాను కలిసి అభినందనలు తెలిపారు. శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఇమాంసాకు అభినందరలు తెలిపిన వారిలో పొదిలి మాజీ సర్పంచి కాటూరి నారాయణ ప్రతాప్, టిడిపి మండల అధ్యక్షుడు మీగడ ఓబుల్ రెడ్డి, నాయకులు గునుపూడి భాస్కర్, యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఆవులూరి యలమంద, తానికొండ వెంకట్రావు, షబ్బీర్, ఒగ్గు వెంకటరామయ్య దివ్వెల మురళీ మోహన్ రావు, మల్లవరం వెంకట్రావు, ఆవులూరి కోటప్ప నాయుడు, మహమ్మద్ గౌస్, సామి రాజా, ముల్లా గౌస్ బాషా, దంతలూరి వెంకట్రావు, కాటూరి హనుమంతరావు, రబ్బాని, టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం నియామకం

ప్రజాశక్తి-దర్శి : కాంగ్రెస్ పార్టీ దర్శి మండల ఉపాధ్యక్షుడిగా గోరంట్ల కోటేశ్వరరావు, దొనకొండ మండల ఉపాధ్యక్షుడిగా మిట్టా సంజీవరెడ్డి, కురిచేడు మండల ప్రధాన కార్యదర్శిగా కాటం వెంకటరెడ్డి, తాళ్లూరు మండల ప్రధాన కార్యదర్శి కొప్పొలు సాయి నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు తమ నియామకానికి కృషి చేసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి, జిల్లా అధ్యక్షుడు షేక్.సైదా, దర్శి నియోజకవం గ్ఇన్‌ఛార్జివెంకటకష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-ముద్దిపాడు : మండల పరిధిలోని ఇనమనమెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఆనంద్ మోహన్ ఆధ్వర్యంలో 59 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 21 కంటి ఆపరేషన్ అవసరమని నిర్ధాంచారు. వీరికి గుంటూరు పెదకాకానిలోని శంకర్ నేత్రాలయం ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యుడు జయరాజు, డీపీఎంఓ వరప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య,హెచ్‌వి నాగరాజు, దరియా, సురేష్, శైలజ, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - పంగులూరు

అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. సిపిఎం సమావేశం సందర్భంగా ఆయన విలేకరులతో గురువారం మాట్లాడారు. గత రెండు మూడు రోజుల నుండి కురుస్తున్న అకాల వర్షానికి అద్దంకి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. దీనివలన రైతాంగం తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రస్తుతం మిర్చి, పొగాకు, మొక్కజొన్న పంటలు అకాల వర్షానికి దెబ్బతిన్నాయని చెప్పారు. మొక్కజొన్న పంట కొంత పొలాల్లో నిలువు మీద ఉందని, కొంత కోసి కల్లాల్లో ఉందని, గాలికి, వర్షానికి పైరు మొత్తం పడిపోయిందని చెప్పారు. ఇప్పుడు ఆ పైరుని కాపాడుకోవాలంటే రైతుకు మరికొంత అదనపు భారం పడుతుందని చెప్పారు. మిర్చి ప్రస్తుతం కల్లాల్లో ఆరబెట్టి ఉందని, వర్షానికి కొంత తడిచి పోయిందని, ఇంకా కొంత కోయాల్సి ఉందని చెప్పారు. పొగాకు తాళ్లు పొలాల్లోనే ఉండి అకాల వర్షానికి కొంత తడిసిపోయిందని, ఇంకా కొంత ఆకు కొట్టాల్సి ఉందని, ఈ ఆకు కూడా తడిసిపోయిందని చెప్పారు. అసలే బర్లి పొగాకు సరైన ధరలు లేవని, నల్లబర్లీ పొగాకును కంపెనీలు కొనడం లేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై పంట నష్టాలు అంచనా వేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకును కంపెనీలు కొనుగోలు చేయకపోవటం పట్ల రైతాంగం తీవ్ర ఆవేదనతో ఉన్నారని అన్నారు. ఈ పర్యటనలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు ఉంటారని తెలిపారు. జిల్లాలోని పర్చూరు, ఇంకొల్లు, దుద్దుకూరు, చందలూరు, పంగులూరు ప్రాంతాల్లో పర్యటిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూసపాటి సుబ్బరాజు, రాయిని కృష్ణకుమారి, పి ఏలియా పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు పర్చూరు, బోడవాడ, అడుసుమల్లి గ్రామాల్లో శుక్రవారం పర్యటిస్తారని రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్, బండి శంకరయ్య తెలిపారు.

మార్టూరు : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిని రైతుల నష్టపోయారని, మొక్కజొన్న, మిర్చి, నల్ల బర్లి పొగాకు అపార నష్టం వాటిల్లిందని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. పంట నష్టాలను అంచనావేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఎడిఎ కె శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ద్రోణాదుల గ్రామంలోని సొసైటీ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, మార్టూరు, వరపర్ల గ్రామాల్లో కూడా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి ఎం కృష్ణమూర్తి, బత్తుల హనుమంతరావు, వై రాంబాబు, శేషాద్రి, సూరిబాబు పాల్గొన్నారు.


మార్టూరులో వినతి పత్రం అందజేస్తున్న రైతు నాయకులు


తహశీల్దారును సత్కరిస్తున్న జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ

తహశీల్దారుకు సత్కారం

ప్రజాశక్తి - కారంచేడు

తహశీల్దారుగా పనిచేస్తున్న నాగరాజును జిల్లా వైద్యాధికారి విజయమ్మ గురువారం అభినందించారు. కలెక్టరేట్లో సీసీగా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదోన్నతి పొంది కారంచేడు తహశీల్దారుగా నియమితులైన నాగరాజును ఆమె కారంచేడు కార్యాలయంలో శాలువాతో సత్కరించి జ్ఞాపక అందజేశారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


స్మశాన స్థలం శుభ్రం చేయిస్తున్న సర్పంచి కృష్ణమోహన్

స్మశాన స్థలాల్లో శుభ్రం..

ప్రజాశక్తి - కొల్లూరు

ఈనెల 20న ఈస్టర్ పండుగను సందర్భంగా క్రైస్తవ పెద్దలను స్మరించుకునేందుకు అనువుగా స్మశాన స్థలాలను మండలంలోని తోకలవారిపాలెంలో సర్పంచి టి కృష్ణమోహన్ పర్యవేక్షణలో గురువారం పరిశుభ్రం చేశారు. తోకలవానిపాలెం, తురకపాలెం గ్రామాల్లోని స్మశాన స్థలాల్లో ఉన్న ముళ్ల కంప తొలగించి బాగు చేయించారు.


మాట్లాడతున్న ఎమ్మెల్యే కొండయ్య

స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- చీరాల

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛంద విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. వేటపాలెం మండలం రామాపురంలోని ఆంజనేయస్వామి విగ్రహం నుండి రివేరా రిసార్ట్ వరకు ర్యాలీ నిర్వహించాలి అన్నారు. ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, డి ఎస్పీ మహ్మద్ మెయిన్, తహశీల్దారు గోపికృష్ణ, చీరాల, వేటపాలెం ఎంపిడిఓలు శివ సుబ్రహ్మణ్యం, రాజేష్, ఎంఈఓ సుబ్రహ్మనేశ్వరవు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సలగల రాజశేఖరబాబు

టిటిడిపై అసత్య ప్రచారం మానుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

తిరుమల తిరుపతి దేవస్థానంలో చనిపోయిన ఆవుల సంఖ్యపై అభూత కల్పనలతో అసత్య ప్రచారం చేస్తూ భూమన కరుణాకరరెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు అన్నారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో గొలపల శ్రీనివాసరావు, తానికొండ దయా బాబు, ఫరీద్ మస్తాన్, మదపాటి ఆంద్రెయ, గుడిపల్లి సాంబశివరావు, యలమంద, పరిశా రమేష్ గౌడ్, నాగరాజు, రాఘవేంద్ర, ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'చేనేత' హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

చేనేత కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గద్దె హేమ సుందరరావు, ఎం సత్యనారాయణ కోరారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలపై చేనేత జౌళీ శాఖ ఎడి కె నాగమల్లేశ్వరవుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ నేత నేస్తున్న ప్రతి చేనేత కార్మికునికి అనుబంధ వృత్తులైన చిలపలు, పడుగులు కార్మికులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుకు మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. గత వైసిపి అనుసరించిన మార్గదర్శకాలే ప్రస్తుత ప్రభుత్వం ఆలంబిస్తున్నందువల్ల షెడ్డు కార్మికులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. వర్క్ షెడ్ నిర్మించుకున్న కార్మికులకు ఒక్కొక్కరికి రూ.60 వేలు బకాయి విడుదల చేయాలని అన్నారు. చేనేతలకు రూ.200 కోట్లు కేటాయించాలని, నేతన నేస్తం ప్రతి కార్మికుడికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు మురళీకృష్ణ, గట్టు నరసింహారావు, ఎనకాల ప్రసాదరావు, సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు, చేతి వృత్తుల కమిటీ జిల్లా కన్వీనర్ పి కొండయ్య పాల్గొన్నారు.


ఏడికి వినతి పత్రం అందజెస్తున్న చేనేత నాయకులు

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కొండ మంజులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) పథకంలో భాగంగా రూ.1.50వేల విలువైన పరికరాలు చీమకుర్తిలోని ఎపి గ్రానైట్స్ మిడ్ వెస్ట్ లిమిటెడ్ సంస్థ బహూకరించినట్లు పాఠశాల హెచ్ఎం ఇమ్మడిశెట్టి అనిత తెలిపారు. పాఠశాలకు ఒక కంప్యూటర్ ప్రింటర్, ఒక కంప్యూటర్ సిపియు, 25 కుర్చీలు, 8 సీలింగ్ ఫ్యాన్స్, రెండు ర్యాకులు ఎపి మిడ్ వెస్ట్ గ్రానైట్ లిమిటెడ్ మేనేజర్ అంబటి శ్రీనివాసరావు పాఠశాల ఉపకరణాలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బత్తుల రామకోటిరెడ్డి, చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, రావుల వెంకన్న, రావుల సురేష్, జంపాని హరిబాబు, బొప్పూడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కోటపాడు యుపి పాఠశాలకు కూడా మూడు బీరువాలు, ఒక డస్క్ టాప్, మూడు ఎస్ కుర్చీలు, ఒక డస్క్ టాప్ టేబులు, రెండు ఆఫీస్ టేబుల్స్ బహుకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వేణుబాబు, గుంటుపల్లి జనార్ధనరావు, గడ్డం నాగేశ్వరరావు, పేర్ని వీరనారాయణ పాల్గొన్నారు.


హైస్కూలుకు కంప్యూటర్ బహుకరిస్తున్న దృశ్యం

హాకీ క్రీడా పరికరాలు అందజేత

ప్రజాశక్తి - బాపట్ల

క్రీడలను ప్రోత్సహించేందుకు ఔత్సాహికులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని పాత తరం సినీ నిర్మాత పువ్వాడ ఏకాంబరేశ్వరరావు అన్నారు. హాకీ క్రీడా పరికరాల దినోత్సవం సందర్భంగా చెరువు జమ్ములపాలెం జెడ్పి ఉన్నత పాఠశాలకు తన ఆర్థిక సహకారంతో రూ.35వేలు విలువైన హాకీ క్రీడా పరికరాలు పాఠశాల నిర్వాహకులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో పువ్వాడ బసంత్ కుమార్, పాఠశాల హెచ్ఎం కృష్ణారావు, బోయిన వీరచంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


హాకి క్రీడా పరికరాలు అందిస్తున్న పువ్వాడ


బొమ్మలు సెంటర్లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక బొమ్మల సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ మల్ల అంజమ్మ, వై జంక్షన్ వద్దగల ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీనియర్ రొటేరియన్ కెఎస్ఆర్కె ప్రసాద్ ప్రారంభించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, కోట హరిప్రసాదరావు, కోట శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, పాబోలు వెంకటేశ్వర్లు, కాసా అశోక్ కుమార్, పోలిశెట్టి చంద్రశేఖర్, పాబోలు ఉదయభాస్కర్, ఎంవి సుబ్బయ్య, నాగబైరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఉపాధి పనులు ప్రారంభిస్తున్న జెడ్పిటిసి సుబ్బయ్య

ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని కోసూరువారిపాలెంలో ఉపాధి హామీ పథకం పనులను జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య కొబ్బరి కాయ కొట్టి గురువారం ప్రారంభించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ నేత అనగాని శివప్రసాద్ చొరవతో మండలంలో ఉపాధి హామీ పథకం కింద ఎన్నో పనులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు పచ్చపట్ల గంగరాజు, జనసేన అధ్యక్షుడు నరేష్ యాదవ్, టెక్నికల్ అసిస్టెంట్ జాఫర్, ఎఫ్ఎ యేమినేడి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

20న మరుగుదొడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక బస్టాండ్ సెంటర్లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లను ఈనెల 20న ప్రారంభిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి శివరాం ప్రసాద్ తెలిపారు.

తాగునీటి సమస్యలలో నిర్లక్ష్యాన్ని సహించబోను

కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తాగునీటి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఎంత మాత్రం సహించబోనని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో గురువారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లాలో తాగునీరు సరఫరా అవుతున్న తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాలన్నారు. అవసరమైన మోటార్ల మరమ్మతులు, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. ఆయా విషయాల్లో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్థానికంగా ఉన్న రక్షిత మంచినీటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అవసరం లేని చోట ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసినట్లు తన దష్టికి వస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. తాగునీటి సమస్య ఉందని ప్రజలు కాల్ సెంటర్, అధికారులకు ఫోన్ చేస్తే వారితో దురుసుగా ప్రవర్తించినట్లు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటానన్నారు. స్థానికంగా ఉన్న పైప్ లైన్ల మరమ్మతుల పనుల పురోగతిపై ఈ సందర్భంగా ఆమె ఆరా తీశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బాల శంకరరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈలు, డిఈఈలు, ఏఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

వేసవిలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయా నంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి త్రాగునీరు, ఇసుక సరఫరా, స్వచ్ఛఆంధ్ర, సోలార్ విద్యుత్తు,పరిశ్రమల స్థాపన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తాగునీటి ట్యాంకులను ఈ నెల 20 తేదీ లోగా నీటిని నింపుకోవాలని ఆయన అధికారులకు చెప్పారు. సమావేశంలో బాపట్ల కలెక్టర్ జె. వెంకటమురళి మాట్లాడుతూ బాపట్ల మున్సిపాలిటీలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా కష్ణ, పశ్చిమ కాలువల నుండి నీటిని విడుదల చేయాలని కోరారు. జిల్లాలో కష్ణా, పశ్చిమ కాలువ కింద ఉన్న తాగునీటి చెరువులకు నీటిని కూడా నింపుకోవడానికి నీటిని విడుదల చేయాలని చెప్పారు. ఈ వీక్షణ సమావేశంలో కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ , బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి. గ్లోరియా, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్, రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిటీ మిషన్ మేనేజర్ సరెండర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

అవినీతి ,అక్రమాల ఆరోపణలు నేపథ్యంలో ఒంగోలు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కల్పనను గురువారం సంబంధిత శాఖ అధికారులు ఉన్నత స్థాయి అధికారుల వద్ద సరెండర్ చేశారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ గా కల్పన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆమె మీద పలు రకాల అవినీతి ఆరోపణలు ఉన్నట్లుగా సంబంధిత శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి శ్రీహరికి ఫిర్యాదులు అందాయి. ఈ విషయం మీద విచారణ చేపట్టిన ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. నివేదికను పరిశీలించిన ఉన్నతాధికారులు ఆమె మీద క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి ఆదేశించారు. దీంతో సిటీ మిషన్ మేనేజర్ కల్పన గురువారం ఉన్నతాధికారుల వద్ద సరెండర్ అయ్యారు. ఆమెపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని సమాచారం.


విద్యార్థులకు డెమో ద్వారా అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక శాఖ అధికారులు గురువారం స్థానిక శ్రీ సరస్వతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. గృహాలలో అగ్నిప్రమాదాలు, వంట గ్యాస్ ఫైర్, ఎలక్ట్రికల్స్ ఫైర్స్ సంభవించినప్పుడు మంటలను ఎలా ఆర్పాలో డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి వి.శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు

అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

పేదవారి సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయడానికి అదనంగా ఆర్థిక సహా యం అందిస్తుండటంతో లక్ష్యం మేరకు ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురు వారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశమై జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం గహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిం చి జూన్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల గహాలకు సాముహిక గహ ప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యం గా నిర్దేశించిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో మే 31 నాటికి జిల్లావ్యాప్తంగా 8,839 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు కేవలం 2,686 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయిందని, ఇంకా 6,153 ఇళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. సమావేశంలో హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, డిఆర్‌డిఏ పీడీ నారాయణ, మెప్మా పిడి శ్రీహరి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వర రావు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఈఈలు, డిఈలు, ఎఈలు పాల్గొన్నారు.

నీటితొట్టెల నిర్మాణంలో నిర్లక్ష్యం వద్దు

వేసవి దష్ట్యా పశువులకు దాహం తీర్చే నీటితొట్టెల నిర్మాణం లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా హెచ్చరించారు. గురు వారం ప్రకాశం భవనంలో డ్వామా అధికారులు, ఎంపిడిఒలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజ మాన్య సంస్థ పీడీ జి.జోసఫ్ కుమార్, ఏపిడిలు పాల్గొన్నారు.

భూసేకరణ చేపట్టాలి..

సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరా, పరిశ్రమలకు భూసేకరణ,ఇసుక రవాణా,స్వచ్ఛ ఆంధ్ర, పరిశ్రమల స్థాపన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టుల నిర్మాణాలకోసం చీరాల, రేపల్లె డివిజన్‌లలో భూసేకరణ చేపట్టాలన్నారు. రుతుపవనాలు రాకముందే ప్రజలకు ఇసుక కొరత లేకుండా ముందస్తుగా లక్ష టన్నుల ఇసుకను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా నుండి ఇతర రాష్ట్రాలకు ఇసుక ఆక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్టులు, నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు.జిల్లాలో ప్రస్తుతం గాజులంక -1 ఇసుక రీచ్ నుండి ఇసుక సరఫరా జరుగుతుందన్నారు.గాజులంక -2 ఇసుక రీచ్ త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. జువ్వలదిన్నె ఇసుక రీచ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏజెన్సీ ద్వారా త్వరలో ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, జిల్లా సరఫరాల శాఖ అధికారి విలియమ్స్, బాపట్ల, రేపల్లే, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారులు పి.గ్లోరియా, రామలక్ష్మీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

పరిశ్రమల స్థాపనకు వనరులు సమకూర్చాలి

పరిశ్రమల స్థాపనకు అన్ని వనరులు, అనుమతులు సమకూర్చాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. పరిశ్రమల ప్రోత్సాహక జిల్లాస్థాయి కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. పరిశ్రమలతో ఉత్పాదకత, ఉపాధి అవకాశాలు, ఆదాయ వనరులు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ చెప్పారు. పరిశ్రమలు స్థాపించడానికి ముందుకువచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలన్నారు. గతంలో పరిశ్రమలు స్థాపించి మనుగడ సాగిస్తున్న 41 మంది లబ్ధిదారులకు వివిధ పథకాల కింద రూ.3.0 కోట్ల నిధులు రాయితీ కల్పించాలని ప్రతిపాదిస్తూ జిల్లా కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, కమిటీ కన్వీనర్ జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై రామకష్ణ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఫ్యాప్సా కార్యదర్శి భక్తవత్సలం, తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలి

బ్రోచర్ ఆవిష్కరించిన కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్), శక్తి యాప్‌లపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్), శక్తి యాప్‌లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన బ్రోచర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ బి.చిరంజీవి, డిపిఓ జి.వెంకట నాయుడు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వర రావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఏ.ఏడుకొండలరావు

సివై టిబి స్కిన్ టెస్ట్ చేయించుకోవాలి

వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించే సివై టిబి స్కిన్ టెస్ట్‌ను ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.ఏడుకొండల రావు సూచించారు. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం బోధన, బోధనేతన సిబ్బందికి సివై టిబి స్కిన్ టెస్ట్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా క్షయ, కుష్టు, ఎయిడ్స్ నివారణ సంస్థ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీవాణి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, ప్రభాకర్, సిఎస్‌ఆర్ఎంఒ డాక్టర్ మాధవీలత, ఎస్‌పిఎం విభాగాధిపతి డాక్టర్ బి.తిరుమలరావు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలకు మంచాలు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

గుడ్ న్యూస్ మినిస్ట్రీస్ అంధుల పాఠశాల విద్యార్థులకు దాతలు మంచాలు, నూతన వస్త్రాలు అం దించారు. గురువారం నాడు ఒంగోలు కర్నూల్ రోడ్ లోని రావి అంజయ్య బజార్ లోని గుడ్ న్యూస్ మినిస్ట్రీస్ అంధుల పాఠశాల విద్యార్థులకు ఫాదర్ డిఎస్ పాల్ ఆర్థిక సహకారంతో 25 మంచాలు , ప్యూర్ ఫైవాటర్, పాఠశాలలోని విద్యార్థులకు నూతన వస్త్రాలు అందిం చారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్య క్షులు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు అంధులైనప్పటికీ చదువులో బాగా రాణిస్తున్నారన్నారు. వారి చదువులకు దాతలు అండగా నిలవాలని కోరారు. విద్యార్థులకు మంచాలు, బట్టలు అందించి మానవత్వం చాటిన దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమం లో బిసి సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు సినీ నటుడు దన్నారపు మస్తాన్ రావు, సంస్థ నిర్వాహకులు స్వర్ణ మోహన్ రావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు ఏఎంసీ డైరెక్టర్‌గా మమత

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన వినుకొండ మమత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మమత ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో శుక్రవారం ఊరచెర్వు, సమైక్యతా నగర్, కొత్త కూరగాయల మార్కెట్, ఆర్‌టిసి బస్టాండ్, మఠం బజార్, బాలకష్ణాపురం, కర్నూల్ రోడ్డు తదితర ప్రాంతాలలో ఉదయం 7 గం నుండి మధ్యాహ్నం 1 గం వరకు విద్యుత్ మరమ్మతుల కారణం వలన విద్యుత్తు సరఫరా అంతరాయం కలదని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి.పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గ్రామీణ వైద్యుల సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఒంగోలు నగర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పద్మావతి ఫంక్షన్ హాల్ లో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలలో అధ్యక్షులుగా పెళ్లూరు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పెండెం వెంకట కష్ణారావు, కోశాధికారిగా జానా శ్రీనివాసు ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఒంగోలు మండలం నుండి 60 మంది పైగా సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బట్టు బాలాజీ, పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డి.సింగయ్య, ఎస్‌కె ఇమాంసా, గౌరవాధ్యక్షులు భాస్కర్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శి నాగరాజు ఎన్నికలను పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న ఎంఈఓ నీలం దేవరాజ్

ఆదర్శ పాఠశాలగా ఎంపిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు గ్రామంలోని భోగేశ్వరపేటకు చెందిన బిఆర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నీలం దేవరాజ్, పులి లాజర్ మాట్లాడుతూ డిఆర్ పాఠశాల మండలంలో ఆదర్శ పాఠశాలగా ఎంపికైంద న్నారు. ఈ పాఠశాలకు పిరియడ్ల స్థాయిలో జిల్లా పరిషత్తు పాఠశాల ప్రమాణాలతో సబ్జెక్టుల వారీగా విద్యాబోధన చేస్తారని అన్నారు. సర్పంచ్ దారా రవి కిరణ్మయి దంపతు లు మాట్లాడారు. వేడుకల్లో భాగంగా పాఠశాల బాల బాలికలు సంస్కృతిక కార్యక్రమాలు, కోలాట విద్యా ప్రదర్శ న, ఆంగ్ల భాషలో మోనోయాక్ట్, జానపద నృత్యాలు ప్రద ర్శించారు. ప్రతిభ చూపిన బాల, బాలికలకు విశ్రాంత ఉపా ధ్యాయులు జి మల్లికార్జునరావు, స్థానిక కెవి హెూమియో క్లినిక్ వైద్యులు కె శివరామకృష్ణ సమకూర్చిన బహుమ తులను సర్పంచ్, ఎంఈఓల చేతుల అందచేశారు. పాఠశా ల్లో ఏర్పాటు చేసే సౌకర్యాలు ప్రతి ఒక్కరికి అందేలా హాజరై న తల్లిదండ్రులందరు ప్రచారం చేయాలని కోరారు. రాను న్న వేసవి సెలవుల్లో పాంప్లెట్స్ ద్వారా స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామని హెచ్ఎం షేక్ హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సాంబశివరావు

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగించాలి

ప్రజాశక్తి - రేపల్లె

ఈ-వ్యర్థాల అనర్థాలు తెలుసుకుని మన ఇంటిలో, పని ప్రదేశంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగించుకోకపోతే తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పాటు పర్యావరణానికి హాని కలిగిస్తాయని కమిషనర్ కె సాంబశివరావు తెలిపారు. స్థానిక తాలూకా ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ-వ్యర్థాలు తొలగింపుపై వివిధ శాఖల అధికారులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో (ఈ-వేస్ట్) పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని అన్నారు. తహశీల్దారు ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లోని పనికిరాని కంప్యూటర్లు, మానిటర్లు, ప్రింటర్లు, టివిలను బయట పారవేయకుండా పురపాలక పారిశుధ్య సిబ్బందికి అందచేసినట్లయితే వాటిని రీయూజ్, రీసైకిల్ చేయటానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఎంపిడిఒ ఎం శోభారాణి, సబ్ రిజిస్ట్రార్ బి కిషోర్ కుమార్, ఎస్ఆర్ఒ ఎస్ మల్లిఖా ర్జునరావు, ఇన్స్పెక్టర్ ఎ రామచంద్రరావు పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బేతపూడి, స్టువర్టుపురం గ్రామాల్లో నాటు సారా నిర్మూలనకు ప్రజలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. నవోదయ 2.0లో భాగంగా బాపట్ల అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరిండెంట్ బి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాటు సారా కేసుల్లో నిందితులుగా ఉన్న వారి ఇళ్లకు వెళ్లి నాటు సారా తయారీ, అమ్మకం, రవాణా వంటి చర్యలకు పాల్పడితే చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ పి గీతిక, రూరల్ సర్కిల్ సిఐ హరికృష్ణ, వెదుల్లపల్లి ఎస్ఐ పి భాగ్యరాజు, ఎక్సైజ్ సబ్ ఎస్ఐలు డి ప్రభుదాస్, ఎస్ మౌనిక, స్టువర్టుపురం విఆర్ఒ విజయలక్ష్మి, బేతపూడి విఆర్ఒ వలిబాబు పాల్గొన్నారు.

అధిక పోషక విలువలున్న పదార్థాలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బట్టిప్రోలు

తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు గర్భిణీలు, బాలింతలు వినియోగించుకోవాలని ఎంపీపీ డివి లలితకమారి సూచించారు. అద్దేపల్లి చెల్లమ్మ అంగన్వాడి కేంద్రంలో గురువారం జరిగిన పోషణ్ పక్వాడ కార్యక్రమంఆమె మాట్లాడారు. జడ్పిటిసి తిరువీదుల ఉదయ భాస్కరి, అమర్తులూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని విజయలక్ష్మి సామూహిక సీమంతాలు నిర్వహించి గర్భిణీలకు అవసరమైన వస్తువులు అందజేశారు. సూపర్వైజర్ సంపూర్ణ పాల్గొన్నారు.

అమృతలూరు : మండలంలోని మోపరు సెక్టార్లో పోషణ్ పక్వాడ గురువారం నిర్వహించారు. సూపర్వైజర్ శాంతిశ్రీ ఆధ్వర్యంలో గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం వినియోగించుకోవాల్సిన అంశాలపై వివరించారు.

చుండూరు : మండలంలోని మోదుకూరు సెక్టార్ పరిధిలోని చిన్నపరిమి గ్రామంలో పోషణ పక్వాడ ర్యాలీ, అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. సూపర్వైజర్ నాగరాజు కమారి ఆధ్వర్యంలో అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు, చిరు ధాన్యాలు వినియోగించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.



భట్టిప్రోలులో సీమంతాలు జరుపుతున్న ఎంపిపి లలిత

వేటపాలెం : తల్లి, బిడ్డల ఆరోగ్యమే దేశ సంపదని ఎంపిడిఒ మెడబలిమి రాజేష్ బాబు అన్నారు. మండలంలోని దేశాయిపేటలో పోషణ్ పక్వాడ గ్రామసభ గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ ద్వారా ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్టార్ సూపర్వైజర్ సజ్జ లీలావతి చెప్పారు. విగ్నేశ్వర కాలనీకి చెందిన పాలెపు సుకన్యకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సీమంతం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి వెంకటేశ్వరరావు, అంగన్వాడి లీడర్లు ఎ బ్యులా కుమారి, బి పద్మావతి పాల్గొన్నారు.

రేపల్లె : మండలంలోని బేతపూడి సెక్టార్ పరిధిలోని నల్లూరుపాలెంలో వెయ్యి రోజుల పోషణ, పక్వాడ్ గురువారం నిర్వహించారు. సిడిపిఒ ఎం సుచిత్ర గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైసర్ వెంకటరత్నం, సుజాత, ధనమణి పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషణ పక్వాడ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంకొల్లు జడ్పీ హెచ్ నుంచి స్థూపం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. సిడిపిఒ ఝాన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మంలో వెయ్యి రోజుల సంరక్షణలో శ్రద్ధ వహించాలని సిడిపిఒ చెప్పారు. ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వాణిశ్రీ, వదనకుమారి, హిమబిందు, బేబీ సుమలత, సునీత, ఉష, వాణి పాల్గొన్నారు.

పర్చూరు : అంగన్వాడి కేంద్రాల్లో బరువు తక్కువగా ఉన్న పిల్లలకు ఆకలి పరీక్షలు నిర్వహిస్తారని సిడిపిఒ జి సుభద్ర పేర్కొన్నారు. పోషణ పక్వాడ పక్షోత్సవంలో భాగంగా పర్చూరులోని 5వ సెంటర్ నందు పిల్లల ఆకలి పరీక్షలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో యుపి స్కూల్ హెచ్ఎం ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారతీయ విశిష్టత చాటిన సర్వేపల్లి

ప్రజాశక్తి - బాపట్ల

భారతీయ తత్వశాస్త్ర విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయి బాబు అన్నా రు. సర్వేపల్లి 50వ వర్ధంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో సర్వేపల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ రాష్ట్రపతి పీఠాన్ని అధిష్టించి, భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. ఆయన రచించిన గ్రంథాలు అజరామరమని అన్నారు. బాపట్ల కు చెందిన కామరాజు హనుమంతరావుకు తన కుమా ర్తెను ఇచ్చి వివాహం జరిపించి, బాపట్ల వియ్యంకునిగా, బాపట్ల వాసులకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టారని అన్నా రు. న్యాయవాది జమ్మద్ బాషా, సాహితీ భారతి అధ్యక్షు లు రావూరి నరసింహ వర్మ, అబ్రహాం లింకన్, అబ్దుల్ రషీద్, డేనియల్, చంద్రబాబు, రాజు పాల్గొన్నారు.



సర్వేపల్లి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఇంకొల్లు : మండలంలోని ఇడుపులపాడులో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 50వ వర్ధంతి నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి పూల మాల వేసి నివాళి అర్పించారు.

ఉపాధ్యాయులు జ్యోతినిర్మలకు సన్మానం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని చక్రాయపాలెంలో హెచ్ఎం, ఉపా ధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు ఎస్ఎంసి ఆధ్వర్యం లో మే 31న ఉద్యోగ విరమణ చేయబోతున్న ఉపాధ్యా యురాలు పూనూరు జ్యోతినిర్మలకు ఘన సన్మానం చేశారు. హెచ్ఎం కెవి శ్రీనివాసరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. 34ఏళ్లు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సేవలందించారని అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం డివిఎస్ పద్మావతి మాట్లాడుతూ 2024లో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన జ్యోతి నిర్మల తన విద్యార్థుల ప్రేమాభిమానాలు ఎంతగానో పొందారని ప్రశంసించారు. సర్పంచ్ గోగులమూడి నగేష్ తన తొలి గురువు జ్యోతిర్మల వ్యక్తిత్వం, సేవాభా వం గురించి ప్రశంసించారు. ఆమె తన కుమారుడు కులదీప్, కుమార్తె స్వేత శిల్ప సంయుక్తంగా పాఠశాల్లో మైక్ సెట్ ఏర్పాటుకు, అభివృద్ధి పనులకు రూ.50వేల నగదు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ వంకాయలపాటి తిరుమల లక్ష్మి, వడ్లపల్లి వీరనారా యణ, హెచ్ఎం శ్రీనివాసమూర్తి, శ్రీనివాసులు, గురవయ్య, గంగాధరరావు,సుజాత, నాగేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కోట రామలక్ష్మి, బివి రత్నం, మల్లికార్జునరావు, విజయ భాస్కర్, జ్యోతినిర్మల బంధువులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు జ్యోతినిర్మలను సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన రవీంద్ర

ప్రజాశక్తి - వేటపాలెం

ఉపాధ్యాయవృత్తికి పన్నెం రవీంద్రన్ వన్నె తీసుకొచ్చారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక బిబిహెచ్ ఉన్నత పాఠశాల్లో గణిత ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఆయన మే 31న ఉద్యోగ విరమణ పొం దుతున్న సందర్భంగా పాఠశాల ఆవరణలో అభినందన సత్కారం చేశారు. 27ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని అన్నా రు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేశారని అన్నారు. తన చెల్లెలు జ్ఞాపకార్థం గత పదేళ్ళుగా ఇంట ర్ సైన్స్ విద్యార్థులకు రికార్డులు, మ్యానువల్స్ అందజే స్తూ తన దాతృత్వాన్ని చాటుకున్నారని అన్నారు. ఉపా ధ్యాయులు రవీంద్రను ఘనంగా సత్కరించారు. కార్యక్ర మంలో విద్యా సంస్థల అధ్యక్షులు బండ్ల అంకయ్యశెట్టి, ఉపాధ్యక్షులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, సెక్రటరీ, కరస్పాండెంట్ చల్లా వాసు దేవరావు, బండ్ల రవీంద్రనాథ్, గుత్తి హేరంబరావు, ప్రిన్సిపాల్ పి బాల సుబ్రహ్మణ్యం, ఉమ్మిటి దక్షి ణామూర్తి పాల్గొన్నారు.



సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

రెండో వ్యక్తి కూడా మృతి

ప్రజాశక్తి - బాపట్ల

పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్న ఘటనలో గాయపడి చికిత్స పొందుతూ నల్లమోతు మాధవి, తులాబంధు లక్ష్మీనారాయణ ఒకరోజు వ్యవధిలో మృతి చెందారు. గుంటూరులో చికిత్స పొందుతూ మాధవి ఈనెల 16న మృతి చెందగా గంటల వ్యవధిలో లక్ష్మీనారాయణ కూడా మృతి చెందారు. మూడు దశాబ్దాల స్నేహ అనుబంధం మంటల్లో కలిసిపోయింది. ఆర్థిక లావాదేవీల్లో జరుగుతున్న కొన్ని వివాదాల నేపథ్యంలో ఈ సంఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఎక్కడా దీనికి సంబంధించిన స్పష్టత లేదు. బ్యూటీషియన్గా బాపట్లకు పరిచయమైన నల్లమోతు మాధవి పట్టణంలో సూపర్ మార్కెట్, ఒక హెూటల్ నిర్వహిస్తున్నారు. ఆమె ఇంట్లోనే మగ్గం డిజైన్ల ద్వారా ఆదాయాన్ని గడిస్తున్నారు. ఇటీవల ఇద్దరి మధ్య కొన్ని వివాదాలు తలెత్తినట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఆర్థిక పరమైన అంశాల్లోనే సంఘటన జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. పూర్తి వివరాలు పోలీసు విచారణలో తేలాల్సి ఉంది.



మాట్లాడుతున్న ఎంపీపీ డివి లలిత కుమారి

అధికారులు హాజరు కావాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపిపి దావూరి వెంకట లలిత కుమారి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు సమావేశా నికి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం సర్పంచులు, ఎంపీటీసీలకు ఇవ్వాలని అన్నారు. జనవరి నెల నుండి ఉపాధి హామీ కూలీల దినసరి వేతనాలు అందడం లేదని అన్నారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు మెటీరియల్ బిల్లులు పడలేదని, ఆలస్యానికి కారణాలపై ఉపాధి హామీ అధికారులను ప్రశ్నించారు. ఎంఎల్సి ఎన్నికల కారణంగా మార్చిలో జరిగిన సమావేశంలో ఎలాంటి తీర్మానాలు చేయలేదని అన్నారు. ఎంపిటిసిల అభ్యర్థనల మేరకు సిసి రోడ్లు, డ్రైన్లు, పైపులైన్లు రిపేర్లకు నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో జడ్పిటిసి తిరువీధుల ఉదయ భాస్కరి, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, యుపిఆర్డి టి ఊహారాణి, ఎఒ సిహెచ్ జలజ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

గోవా మద్యం పట్టివేత

ప్రజాశక్తి - చీరాల

ఇతర రాష్ట్రాల్లో మద్యాన్ని కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు చేస్తున్న స్థావరంపై ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు గురువారం మెరుపు దాడి చేశారు. మండలంలోని వాడరేవు సునామీ కాలనీలో గోవా నుండి మద్యం కొనుగోలు చేసి ఓ ఇంటిలో నిల్వ ఉంచి షాపుల ద్వారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం వచ్చిందని ఎన్ఫోర్స్మెంట్ అధికారుల తెలిపారు. స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ పి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎసి కె విజయ ఆదేశాల మేరకు దాడిచేసి 550 మద్యం బాటిళ్లను స్వాధీన చేసుకున్నట్లు తెలిపారు. సిఐ బి శ్రీహరి, కేర్ రమాదేవి, ఒంగోలు సీఐ రామారావు, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, టూ టౌన్ ఎఎస్ఐ టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

బాల్య వివాహాలు అరికట్టాలని ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓలు పి లాజర్, టి నవీన్ కుమార్, పల్లపట్ల సిడిపిఓ, అంగన్వాడి సూపర్వైజర్లు, హెచ్ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పంగులూరు : వివాహ వయస్సు రాకుండా పెళ్లిళ్ళు చేయకూడదని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపిడిఒ కె స్వరూపరాణి అన్నారు. స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాల్లో బాల్య వివాహాల నిరోధక చట్టం 2006పై గురువారం అవగాహన కల్పించారు. పంగులూరు సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెచ్ఎం కొప్పోలు రమాదేవి, పంచాయతీ కార్యదర్శి బి రాంబాబు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని అసిస్టెంట్ కమిషనర్ ఎస్ఎఫ్ అమరావతి సుధాకరరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు పరిశీలించారు. గత నెల మద్యం అమ్మకాలు మద్యం నిల్వలపై ఆరా తీశారు. షాపు లైసెన్స్ దారులు అందరూ తప్పనిసరిగా ఎ4, 2బి బార్ షాపు నియమాలు పాటించాలని చెప్పారు. సమావేశంలో సీఐ దివాకర్, ఎస్ఐ రాజశ్రీ పాల్గొన్నారు.

వేసవిలో భూసార పరీక్షలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రైతులందరూ ఈ వేసవిలో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఎఒ టి బాలాజీ గంగాధర్ సూచించారు. భూసార పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. రైతులు తమ పొలంలో ఉన్న లోటుపాట్లు తెలుసుకుని ఎరువుల వాడకాన్ని చేపడితే మంచి దిగుబడి వస్తుందని అన్నారు. భూసార పరీక్షలకు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. గుళ్లపల్లిలో ఆయన భూసార పరీక్షలను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఎఇఒ ప్రియాంక, మాధవి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన అవసరమని అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వరరావు అన్నారు. అగ్ని ప్రమాదాల వారోత్సవాల్లో భాగంగా బాపట్ల పబ్లిక్ స్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రయోగాత్మక సూచనలు చేశారు. వంటగ్యాస్ వినియోగం, విద్యుత్ పరికరాలు వాడకంలో అలసత్వం వద్దని అన్నారు. ఒక విద్యార్థికి అవగాహన కల్పిస్తే కుటుంబం మొత్తానికి తెలియజేసినట్లేనని అన్నారు.

డ్రోన్‌లతో భద్రతా చర్యలపై నిఘా

ప్రజాశక్తి- చీరాల

పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇతర ప్రధాన ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా నిఘా పెట్టారు. వన్‌టౌన్ సీఐ సుబ్బారావు, టూ టౌన్ సీఐ నాగభూషణం పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా చేపట్టినట్లు తెలిపారు. నిర్మానుష్య ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాల్లో గంజాయి, మద్యం సేవిస్తున్నవారిని గుర్తించి చర్యలు తీసుకునే దిశగా నిఘా మరింత కఠినతరం చేసినట్లు తెలిపారు.

విద్యుత్ నిలిచిపోవడంతో అంధకారం

ప్రజాశక్తి - వేటపాలెం

ఓ వైపు మండుతున్న ఎండలు. మరోవైపు ఈదురు గాలులు, వర్షం. గత మూడు రోజులుగా అకస్మాత్తుగా మారుతున్న వాతావరణం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. బుధవారం రోజంతా ఎండ కాయగా సాయంత్రం నుంచి ఒక్కసారిగా చల్లబడిపోయింది. కల్లాల్లో ఆరబోసిన పంటను కాపాడుకోవడానికి రైతులు పట్టలు కప్పినప్పటికీ ఈదురు గాలులకు పట్టలు లేచిపోతున్నాయి. గాలులకు గ్రామాల్లో విద్యుత్తు నిలిచిపోయింది. వేటపాలెంలో మార్కెట్ వద్ద విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంటు లేక చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అర్ధరాత్రి 12 గంటల నుండి గురువారం ఉదయం 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికులు రావన్నపేట విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా స్థానిక లైన్మెన్‌కు సమాచారం అందించాలని సూచించారు. వేటపాలెం టౌన్ ఎఇని వివరణ కోరగా అర్ధరాత్రి లోడ్ అధికంగా ఉండటం వలన కనెక్ట్ చేసిన వైర్లు నిలబడలేదని తెలిపారు. తెల్లారినతర్వాత లోపాన్ని సరిచేసినట్లు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ లోపల విద్యుత్ వైర్లు తెగినట్లు తెలిపారు. దీనిని బట్టి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కెపాసిటీలను అంచనా వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యుత్ అధికారులకు ప్రజలు సూచిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి - యద్దనపూడి



యద్దనపూడిలో మాట్లాడుతున్న ఎడిఎ మోహనరావు

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన ఉత్పత్తులు ఆరోగ్యకరంగా ఉంటాయని పర్చూరు ఎడిఎ మోహనరావు పేర్కొన్నారు. మహిళా సమైక్య ఆవరణలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం వలన లాభాలు, రసాయన వ్యవసాయం వలన కలిగే అనర్ధాలు వివరించారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు బత్తుల మోహనరావు, ఉదయభాస్కర్‌కు సన్మానం చేశారు. ఎన్ఎఫ్ఎ మార్కెటింగ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటలకు మార్కెటింగ్ సర్టిఫికెషన్ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం ఎంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొల్లూరు : ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని వ్యవసాయ అధికారి వై రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపిఎం వాణిశ్రీ, ఎపిఎం రాము, ఎడి విజయబాబు, ఎఒ వెంకటేశ్వరరావు, జడ్పీ ఎన్ఎఫ్ స్వాపు, ఆదర్శ రైతు నిమ్మగడ్డ రామచంద్రయ్య, ఎన్ఎఫ్ ఎఎస్ఎస్ పి సతీష్ బాబు, జీవీ కృష్ణ, శివ రాజేశ్వరమ్మ, వీరబాబు, ఎంటిక్‌పి ఎన్ సుబ్బారావు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా పంటలు పండించాలని రైతు సాధికార సంస్థ అధికారి జానకి అన్నారు. మహిళా కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఆదర్శ రైతులు బెల్లంకొండ రామచంద్రరావు, బి రామాంజనేయులు సన్మానం చేశారు. ఎడిఎ కెవి శ్రీనివాసరావు, ఎఒ అంజిరెడ్డి, వెలుగు ఎపిఎం బి సురేంద్రబాబు, డిపిఎం మోహన్, ఎంపీ రాజశేఖర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

రథం పనుల పరిశీలన

ప్రజాశకి-బాపట్ల

తుది మెరుగులు దిద్దుకుంటున్న భావన్నారాయణ స్వామి దేవాలయానికి చెందిన నూతన రథం పనులను మాజీ శాసనసభ్యులు కోన రఘుపతి గురువారం రాత్రి పరిశీలించారు. రథం పనులపై శిల్పి గణపతి ఆచారి దేవాదాయ శాఖ ఇన్ స్పె క్టర్ శ్రీనివాసమూర్తిని అడిగి తెలుసుకున్నారు జరిగింది. ఈ సందర్భంలో శిల్పి గణపతిఆ చారి పదేపదే ఇదంతా తమరి కృషివల్లే జరిగిందని కోన కృషిని ప్రస్తుతించారు. అంతకుముందు మండలంలో మురుకొండపాడు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై సర్వస్వం కోల్పోయిన బెజ్జం ఉషారాణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పిడుగుపాటుకు వరికుప్ప దగ్గరమై నష్టపోయిన మూలపాలెం గ్రామ రైతు రేగుల గడ్డ వినయ్ కుమార్ ను ఆయా గ్రామాలకు వెళ్లి పరామర్శించారు.ఆయన వెంట బాపట్ల పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు ,మండల అధ్యక్షుడు ఏడుకొండల రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వినోద్‌బాబు

వాహన తనిఖీలు

ప్రజాశక్తి - పంగులూరు

ఎస్పీ ఆదేశాల మేరకు రేణింగవరం జంక్షన్‌లో ఎస్ఐ వినోద్ బాబు గురువారం అర్ధరాత్రి వాహనాలు తనిఖీ చేసినట్లు తెలిపారు. వాహనాల లైసెన్సులు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఇల్లీగల్ యాక్టివిటీస్ మొదలైన అంశాల పరిశీలించినట్లు తెలిపారు. వాహనదారులు అన్ని రకాల లైసెన్స్ కాగితాలు, హెల్మెట్లు తీసుకురావాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని కోరారు. రాత్రి సమయాల్లో ప్రశాంతంగా ప్రయాణించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

గ్రామ సభ దృష్టికి ప్రజాసమస్యలు

ప్రజాశక్తి - అమృతలూరు

గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామ సభల ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ దేవరకొండ రాము సూచించారు. అమర్తలూరులో గురువారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు తక్కువగా ఉన్నారని, అవసరమైనంత మందిని నియమించు కునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలకృష్ణ, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి ఎస్సీ నేతల హర్షం

ప్రజాశక్తి - అద్దంకి

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ తేవటం పట్ల టిడిపి ఎస్సీ సెల్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో టిడిపి ఎస్సీ సెల్ నాయకులు కట్టి అశోక్, ఎంజి స్టాలిన్, మంద నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో గొల్లపల్లి సుబ్బారావు, బల్లికురవ ఎస్సీ సెల్ అధ్యక్షులు వేల్పుల అబ్రహం, పూనూరి నెహెమ్యా, అద్దంకి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పూనూరి స్వామి, పసుమర్తి సామ్యూల్, జి రాజశేఖర్, పసుమర్తి కోటయ్య, పూనూరు నరేంద్ర పాల్గొన్నారు.



కేజిబివిలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్

విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

ప్రజాశక్తి- సంతమాగులూరు

విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో పరిస్థితులను ఎదుర్కొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఎస్ఎ యుపిఎం కోఆర్డినేటర్ డాక్టర్ కెపి వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని ఏల్చూరు కెజిబివి పాఠశాల బాలికలకు ఆత్మ ధైర్యం పెంపొందించడం, ధృఢంగా ఎలా ఉండాలనే అంశంపై గురువారం అవగాహన కల్పించారు. మార్కులు మాత్రమే జీవితానికి కొలమానం కాదన్నారు. కార్యక్రమంలో జోన్ 1 కోఆర్డినేటర్ డాక్టర్ ఎంఎస్ కరియప్ప, కౌన్సిలర్లు ఇందిరా ప్రియదర్శిని, ఉమాదేవి, కెజిబివి ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఎంఈఓ2 దినేష్ కుమార్, జిసిడిఓ చారులత పాల్గొన్నారు.



ఎల్లమంద, పడమట గోపిలను సత్కరిస్తున్న అశోక్ బాబు

వైసిపి కార్యదర్శుల నియామకం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బిసిపి కమిటీని ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో గురువారం నియమించారు. వైసిపి మండల కార్యదర్శులుగా అద్దేపల్లికి చెందిన తలకోల యలమంద, కోనేటిపురంకు చెందిన పడమటి గోపి, ఐలవరంకు చెందిన కారంపూడి నాగేంద్రబాబును నియమించారు. కార్యక్రమంలో ఎంపీపీ డివి లలిత కుమారి, ఎంపీటీసీ కొతరపు పద్మావతి, నాగమల్లేశ్వరరావు, సిరాజుద్దీన్, మద్దుల గిరిధర్, కుక్కల భూషణరావు, వేల్చురి నాగేశ్వరరావు, చిన్నారి, కొతరపు శ్రీనివాసరావు, కుందేటి రమేష్ పాల్గొన్నారు.

లంక ప్రజలకు ఉపాధి కల్పించండి

ప్రజాశక్తి - వేమూరు

కృష్ణా నదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాల్లో యంత్రాలు నిషేధించి కూలీలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీఓను కలిసి పలు సమస్యలు వివరించారు. నదీ తీరప్రాంతాల్లో ఇసుక తవ్వకాల్లో యంత్రాల వలన ఆ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఇసుక తరలింపు కోసం కొందరు నదిలో రోడ్లు సైతం వేస్తున్నారని, రోడ్లు వేయడమే కాక టోల్గేట్ వసూలు చేస్తున్నారని అన్నారు. అక్రమ రోడ్డు మార్గం ద్వారా కొందరు పేకాట, కోడిపందేల స్థావరాలు ఏర్పాటు చేసుకుని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని వివరించారు. అక్రమార్కులపై విచారించి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ రామలక్ష్మి తెలిపారు.

తేనెటీగల దాడిలో 14 మందికి గాయాలు

ప్రజాశక్తి - బాపట్ల



చికిత్స పొందుతున్న మహిళ

పట్టణంలోని సూర్యలంక రహదారి గాయత్రి అపార్ట్ మెంట్ వద్ద రావి చెట్టుపై ఉన్న తేనె తుట్టె కదిలి గురువారం ఆకస్మికంగా తేనెటీగలు దాడి చేశాయి. దాడిలో 14 మంది గాయపడి ఏరియా వైద్యశాల్లో చికిత్స పొందుతున్నారు. జన సంచారం అధికంగా ఉన్న ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఆకస్మికంగా తేనెటీగలు దాడి చేశాయని చెబుతున్నారు. కొండ జాతికి చెందిన తేనెటీగలు కావడంతో వాటి దాడికి శరీరంపై ఏర్పడిన దద్దుర్లకు అవసరమైన చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

ఇద్దరు జిల్లావాసులకు 'కందుకూరి' విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లాకు చెందిన ఇద్దరు రంగస్థల నటులు కందుకూరి వీరేశలింగం పంతులు విశిష్ట పురస్కారం అందుకున్నారు. కందుకూరి జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని తెలుగు నాటకరంగ దినోత్సవం రోజున జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల నటులు నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అండ్ అసోసియేషన్ అధ్యక్షులు మిడసల మల్లికార్జునరావు, ఉన్నం శేషయ్య, అంబడపూడి శివప్రసాద్‌కు 2025 సంవత్సరానికి గాను కందుకూరి విశిష్ట పురస్కారాలను బుధవారం రాత్రి విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన సభలో అందించారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక మరియు సినిమా టోగ్రఫీ శాఖా మాత్యులు మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. వీరికి పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాలను అందజేసి, రూ.10 వేల నగదును ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పురస్కారాల ఎంపిక కమిటీ చైర్మన్ డాక్టర్ బుర్రా సాయి మాధవ్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకష్ణ మరియు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలను కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, సింహాద్రి జ్యోతిర్మయి, నాళం నరసమ్మ, తదితరులు అభినందించారు.

మొబైల్ ఏటిఎమ్స్..మూలకు నెట్టారు.!

- రోజుకి సుమారు 2 లక్షల లావాదేవీలు

- 3-4 నెలలుగా నిలిచిన వైనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, పిడిసిబి బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మొబైల్ ఏటిఎమ్స్‌ను మూలకు నెట్టారు. ఇవి మూలకు చేరటంతో నగదు కోసం వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మొబైల్ ఏటిఎమ్స్ ద్వారా రోజుకి 2 లక్షల లావాదేవీలు జరుగుతుండేవి. మొబైల్ ఏటిఎంలు మూలన పెట్టడంతో వచ్చే ఆదాయాన్ని పిడిసిసి బ్యాంకు కోల్పోతోంది. పాలకవర్గం ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేదని బ్యాంకులోని కొంత మంది ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ (పిడిసిసిబి) రైతులకు ఎన్నో విధాలుగా తోడ్పాటును అందిస్తోంది. రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలతో పాటు వివిధ పథకాల ద్వారా అదనపు వడ్డీని ప్రజలు, వినియోగదారులకు అందిస్తోంది. తద్వారా జిల్లా ప్రజల ఆదరాభిమానాలు పొందుతోంది. పిడిసిసి బ్యాంకు పాలకవర్గం కాల పరిమితి ముగియటంతో పర్సన్ ఇన్‌చార్జిగా సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ వ్యవహరిస్తున్నారు.

రోజుకి 2 లక్షల లావాదేవీలు

పిడిసిసి బ్యాంకు పరిధిలో మొత్తం ఐదు మొబైల్ ఏటిఎమ్స్ ఏర్పాటు చేశారు. ఒంగోలు నగరంలో మూడు



నిరుపయోగంగా ఉన్న మొబైల్ ఏటిఎం వాహనాలు

మొబైల్ ఏటిఎమ్స్, మరో రెండు మండల కేంద్రాలలో ప్రజల నగదు అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేశారు. ఆయా మొబైల్ ఏటిఎం ద్వారా రోజుకి సుమారు రూ.2 లక్షల లావాదేవీలు జరిగేవి. ఒంగోలు నగరంలోని ప్రధాన కూడళ్ళలో మొబైల్ ఏటిఎమ్స్‌ను ఉంచటంతో ప్రజలు వారికి అవసరమైన నగదును తీసుకొని వెళ్ళేవారు. గతంలో పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా వైఎం ప్రసాద్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు మొబైల్ ఏటిఎమ్స్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. జిల్లా ప్రజల నగదు అవసరాలను తీర్చేందుకు పాలకవర్గం, అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో పాలకవర్గం కాలపరిమితి తీరింది. అప్పటి నుంచి పర్సన్ ఇన్‌చార్జిగా జెసి, ఇన్‌చార్జి సిఇఒగా కె.రాఘువయ్య ఆధ్వర్యంలో పిడిసిసి బ్యాంకు పాలన కొనసాగుతోంది. అడిగే వారు లేకపోవటంతో పిడిసిసి బ్యాంకు అధికారులు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోంది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పిడిసిసి బ్యాంకు పాలకవర్గాన్ని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మూలకు చేరిన మొబైల్ ఏటిఎంలు

పిడిసిసి బ్యాంకు చెందిన ఐదు మొబైల్ ఏటిఎమ్స్‌ను మూలకు నెట్టారు. గత మూడు, నాలుగు నెలలుగా మొబైల్ ఏటిఎమ్స్‌ను ఉపయోగించటం లేదు. ఇందు నాలుగు మొబైల్ ఏటిఎమ్స్‌ను ఒంగోలు హైదరీ క్లబ్ ఆవరణలో ఉంచారు. మరో వాహనంలోని ఏటిఎంను తొలగించి ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. గత 3-4 నెలలుగా మొబైల్ ఏటిఎం మెషీన్స్‌ను మూలకు నెట్టిన విషయాన్ని బ్యాంకు అధికారులు ఒప్పుకోవటం లేదు. మొబైల్ ఏటిఎమ్స్‌ను తమ స్థలమైన హైదరీ క్లబ్‌లో పెట్టామని చెప్పటం గమనార్హం.

మొబైల్ ఏటిఎంలు కొనసాగిస్తున్నాం..

పిడిసిసిబి సిఇఒ రాఘువయ్య



మొబైల్ ఏటిఎం మెషీన్స్ నిలిపి వేయటంపై ప్రజాశక్తి పిడిసిసి బ్యాంకు సిఇఒ కుంభా రాఘువయ్యను ఫోన్‌లో ప్రజాశక్తి వివరణ కోరింది. మొబైల్ ఏటిఎం సేవలను కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా సంయుక్త కలెక్టర్ వ్యవహరిస్తున్నారని, జెసి ఆదేశాల మేరకు ప్రతి కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు.

'మాదాల' ఆశయాలు ముందుకు తీసుకెళదాం..

సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

ప్రజాశక్తి-చీమకుర్తి

సిపిఎం కె.వి పాలెం సీనియర్ సభ్యులు కామ్రేడ్ మాదాల నారాయణ నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు నిలబడ్డారని, ఆయన ఆశయాలను గ్రామ నాయకత్వం ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు కోరారు. గురువారం మండలంలోని కె.వి.పాలెంలో జరిగిన మాదాల నారాయణ సంతాప సభలో ఆయన మాట్లాడారు. సభకు బెజవాడ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముందుగా మాదాల నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఎస్కె మాబు మాట్లాడుతూ జిల్లా మహాసభ సందర్భంగా వాలంటీర్‌గా మాదాల నారాయణ చేసిన అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మాదాల నారాయణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, జిల్లా నాయకులు పమిడి వెంకటరావు, పూసపాటి వెంకట్రావు, కాలం సుబ్బారావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పొత్తూరి సురేష, టీ రామారావు, కొల్లూరు వెంకటేశ్వర్లు, క్రిష్టిపాటి చిన్నపరెడ్డి, పమిడి రామారావు, పమిడి నరసింహారావు, మాదాల నరసింహారావు, దర్శి సుధాకర్, కొల్లూరు అక్కయ్య, వేమ కొండయ్య, పమిడి సుబ్బారావు, ఆర్ వెంకట్రావు, మాదాల నారాయణ కుటుంబ సభ్యులు మాదాల వెంకటరావు, కోటేశ్వరరావు, నాగేంద్ర, శ్రీదేవి ,సదీప్, సౌజన్య, రామకోటయ్య, యమునా, బంధువులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

'పండుగ' సరే.. నిధులేవీ.?

- పల్లె పండుగ పనుల బకాయిలు రూ.25.96 కోట్లు

- 2024 -25 ఆర్థిక సంవత్సరం బిల్లు రద్దు ప్రకటనతో ఆందోళన..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో అట్టహాసంగా ప్రారంభించిన 'పలె ్లపండుగ' పథకం పనులు పూర్తయినప్పటికీ బిల్లులు చెల్లించని పరిస్థితి నెలకొంది. ఈ పథకం కింద ఒంగోలు పిఆర్ఐ డివిజన్ లో ఒంగోలు, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల పరిధిలో 494 పనులకు గాను రూ 25.96 కోట్లు ప్రభుత్వం చెల్లించవలసి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన బిల్లులు రద్దు పరిస్తున్నట్లు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనితో పనులు నిర్వహించి బిల్లులు రావలసిన ' వెండార్లు' ఆందోళన చెందుతున్నారు.

కూటమి అధికారం చేపట్టిన తరువాత ఛిద్రమైన రహదారులు, సైడ్ కాలువల పనులు నిర్వహించడం కోసం గ్రామసభ ద్వారా వ్యక్తులను ఎంపిక చేసి మండలంలో ఎంపిడిఓ సిఫారసులతో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కు పంపిస్తారు. ప్రాజెక్టు డైరెక్టర్ 'వెండార్' పేరుతో 'పనులు నిర్వహించడం కోసం ఖాతా తెరుస్తారు. పనులు పూర్తవగానే ఇంజినీరింగ్ అధికారులు ఎంబుక్ రికార్డు చేయడం, బిల్లు చేసిన అనంతరం పిడి పరిశీలించి 'వెండార్' ఖాతా కు జమ చేయడం ప్రక్రియ. ఈ పద్ధతిన ఒంగోలు డివిజన్ పరిధిలో 620 పనులు నిర్వహించగా, వీటికి సంబందించి ఇంజనీరింగ్ అధికారులు రూ 31.76 కోట్లు బిల్లులు చేసారు. కాగా ఈ బిల్లులకు సంబందించి కేవలం 126 పనులకు సంబంధించిన రూ 5.80 కోట్లు మాత్రమే 'వెండార్ల 'కు చెల్లించినట్లు విశ్వసనీయ సమాచారం. వీటిలో దర్శి నియోజకవర్గంలో 188 పనులు నిర్వహించగా రూ.11.96 కోట్లు చెల్లించవలసి ఉంది. వీటికి గాను 44 పనులకు రూ.3 కోట్లు చెల్లించారు. ఇంకనూ 144 పనులకు రూ.8.96 కోట్ల బకాయి ఉంది. ఒంగోలు నియోజకవర్గంలో 323 పనులు నిర్వహించగా రూ.10.89 కోట్లు చెల్లించాలి. వీటికి గాను 80 పనులకు సంబందించిన రూ.2.61 కోట్లు చెల్లించారు. వీటికి సంబందించి 243 పనులకు గాను రూ.8.28 కోట్లు బకాయిలు చెల్లించాలి. కాగా సంతనూతలపాడు నియోజకవర్గంలో 109 పనులు నిర్వహించగా, ఈ బిల్లులకు రూ.8.91 కోట్లు చెల్లించవలసి ఉంది. అయితే రెండు పనులకు సంబందించి రూ.19 లక్షలు మాత్రమే చెల్లించడం గమనార్హం. ఇంకనూ 107 పనులకు గాను రూ.8.72 కోట్ల బకాయిలు చెల్లించవలసి ఉన్నట్లు తెలిసింది. సకాలంలో పనులు పూర్తి చేసి, బిల్లులు రికార్డ్ చేసినప్పిటికి నిర్వాహకుల ఖాతాల్లో జమ చేయక పోవడం, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 2024 -25 ఆర్థిక సంవత్సరం పెండింగ్ బిల్లులు రద్దు ప్రకటించడంతో 'వెండార్లు' ఆందోళన చెందుతున్నారు.

వైద్యసేవల్లో లోపాలకు

రూ.20.20 లక్షల పరిహారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైద్య సేవా లోపాలకు రూ.20.20 లక్షల పరిహారం ఫిర్యాదుదారుకు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ న్యాయమూర్తులు గురువారం తీర్పు ఇచ్చారు. వివరాలు పరిశీలిస్తే కందుకూరు మండలం వెంకటాద్రిపాలెంకి చెందిన దామా మౌనిక గర్భం దాల్చిన తరువాత వైద్య పరీక్షల కోసం కందుకూరు కోటారెడ్డి ఆసుపత్రిలోని డాక్టర్ మృదులను కలిశారు. ఆమె సలహా మేరకు ఒంగోలు కర్నూల్ రోడ్డులోని మెడాల్ డయాగ్నోస్టిక్స్ హెల్త్ కేర్‌లో రేడియాలజిస్ట్ డాక్టర్ జాలాది మణిబాబు వద్దకు స్కాన్ కోసం వెళ్ళారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో కుడి మూత్రపిండం లేని నవజాత శిశువుకు మౌనిక 2020 మార్చి 30న జన్మనిచ్చింది. వైద్యాధికారి, మెడాల్ హెల్త్ కేర్ రేడియాలజిస్ట్ లోప భూయిష్టమైన సేవా లోపంతో కలిగిన నష్టాన్ని, మనోవేదనకు ఒంగోలులోని ప్రకాశం జిల్లా వినియోగదారుల కమిషన్‌లో 2021లో కేసు నమోదైంది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన తరువాత విధి నిర్వహణ, సేవా లోపాలు రుజువు కావటంతో మెడాల్ హెల్త్ కేర్ సెంటర్ యాజమాన్యం, రేడియాలజిస్ట్ డాక్టర్ జాలాది మణిబాబు ఇరువురూ కలసి ఫిర్యాదుదారికి నష్టపరిహారంగా రూ.10 లక్షలు, మనో వేధనకు ఐదు లక్షల రూపాయలు, నిర్లక్ష్య వైద్య సేవలకు కందుకూరు కోటిరెడ్డి ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ మృదుల రూ.5 లక్షలు , కోర్టు ఖర్చులు రూ.20 వేలు మొత్తం రూ.20 లక్షల 20 వేలు దామా మౌనికకు ఆరు వారాలలో చెల్లించాలని వినియోగదారుల కమిషన్ న్యాయమూర్తులు డి.శ్రీదేవి, వై.సుందరరావు, డాక్టర్ ఎస్‌పి సమీరా తీర్పు ఇచ్చారు.

వినియోగదారుల కమిషన్ తీర్పు

19న ఈ-వ్యర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్: స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ- వ్యర్థాల నిర్వహణపై ఈ నెల 19న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేక ఇతివృత్తంతో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులతో గురువారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఆర్‌ఓ చినఓబులేసు పాల్గొన్నారు.